## మతిలేని మతిమరపు

మావారు ఎప్పుడూ నన్ను "మతిమరపు పెద్దమా" అని అంటూంటారు. మీరే చెప్పండి. అన్నం వడ్డించే తొందరలో, మంచినీళ్ళు పెట్టటం మరిచాననుకోండి. ఎప్పుడో అవుసరం వచ్చే నీళ్లకు ఇప్పుడు తొందర ఏమిటి అని వూరుకోరు. "అదిగో మతిమరపు" అబ్బ! నీలాంటివాళ్ళు ఇక ప్రపంచములో వుండబోరు అని అంటారు. ఈ రకంగా అంటూవుంటే నాకు అదోలా వుండేది. ఒకరోజు మా స్నేహితురాలు, రాధ మా ఇంటికి వచ్చింది. మాటల్లో మావారు ఇలా అంటారు. నేనేనా అంత మతిమరపు ఇంకా ఎవరన్నా వుంటారా అన్నాను. దాంతో ఆవిడ పగలబడినవ్వుతూ, మా అన్నయ్య నాకో కథ చెప్పాడు, వాడికి స్వానుభవంగా జరిగిందట, ఈకథ మీ ఆయనకు చెప్పి ఏమిటి మీ సమాధానమని అడుగు అంది. ఆ కథే ఈ కథ.

ఒకసారి వాళ్ల అన్నయ్యవాళ్ళు స్కౌట్ క్యాంపుకు వెళ్ళారట. మామూలుగా దూర, దూరంగా ఒకతోటలో టెంట్లువేసుకున్నారట, మధ్యలో ఒక టెంటులో, ఒక గంటకట్టి అక్కడ ఒక కుర్రవాణ్ణి పెట్టి టైముప్రకారం గంటకొట్టితేవాళ్లు చేయవలసిన పనులు నిర్ణయించుకుంటారట. వాళ్ల రూలు ప్రకారం 2 గంటలు కొడితే ప్రార్థన, 3 కొడితే స్కౌట్‌మాష్టరు ఇనస్పెక్షనుకు వస్తున్నట్టు, అదేవిధంగా 5 కొడితే టిఫెనుకు రమ్మని అర్థం. అదేవిధంగా మాష్టరుఆర్డరుప్రకారం రెండు గంటలు కొట్టమన్నారు. వాడు మరచిపోయి పొరపాటున 3 గంటలు కొట్టాడు. వెంటనే తన తప్పు తెలుసుకొని, ఆ గంటమీద తన జేబుగుడ్డతో తుడిచి (అంటే ఆ రకంగా తుడిచేస్తే మొదట కొట్టిన మూడు గంటలు చెరిగిపోయి విలువలేనట్లు అని అతనివూహ) మరల రెండు గంటలు కొట్టాడట. మొత్తం 5 గంటలయ్యాయి. అందరూ టిఫిను తిందామని కుక్‌టెంట్‌దగ్గరకు పరిగెత్తుకొచ్చారట. అంతా తెలుసుకొని, మనవాడి మతిమరుపు మతిలేంది అన్నారట. ఈకథ మావారికి చెప్పి మీ సమాధానం అన్నాను. దాంతో వారి గొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది సమాధానం కోసం. మీరే చెప్పండి ఎవరి మతిమరపు గొప్పదో.

కూరాళ్ల స్వరాజ్యలక్ష్మి

* * *

## గుణపాఠం

అచ్యుతరావు గుణపాఠం చాలా చెడ్డది — వాడిదృష్టి ఎప్పుడూ 'ఫిమెయిల్స్'మీదే వుంటూంటుంది...అందమైన ఆడది కనిపించిందంటే—మరిక అచ్యుతరావు పడే తిప్పలు ఆ అంతర్యామికే తెలియాలి.

అచ్యుతరావు ఓసారి వాళ్లతాతగారి వూరువెళ్ళాడు. అదంతా ఏజన్సీ ప్రాంతం. తాతగారి ఇంటిప్రక్కనే ఓ పాడుపడిన 'బంగళా' వుంది పగటిపూట ఆ బంగళాలోకి వెళ్లటానికే అందరూ భయపడుతుంటారు. దయ్యాలున్నాయని ప్రతీతికూడాను.

అచ్యుతరావు పొరుగింటి 'ఫారెస్టు' గార్డు డాటర్‌ని 'లవ్' చేసాడు. కాని ఆ అమ్మాయి మన కథానాయకుణ్ణి ప్రేమించలేదు సరికదా పైగా మనవాణ్ణి చూసి అసహ్యించుకునేది! కాని వెనుక పెద్దలగౌరవాన్ని చూసి అచ్యుతరావు ఎన్ని చిలిపి పనులు చేసినా 'కామ్'గా వూరుకునేది. ఆమెమౌనాన్ని అర్ధాంగీకార సూచకంగా భావించి మనవాడు 'బ్రేవ్'గా 'ప్రణయలేఖలు' విసరటం మొదలుపెట్టాడు. దాంతో ఆమె ఉన్నకొద్ది సహనంకూడా కోల్పోయింది.

ఒకరోజు అచ్యుతరావు ఆమెనుంచి 'లెటర్' పొందగలిగాడు. ఆ 'లెటర్'లో వ్రాయబడ్డ సాంకేతికస్థానమైన బంగళాకి చేరుకున్నాడు! రాత్రి 12 గంటల సమయం ... బంగళా భయంకరంగా వుంది ... ప్రణయదేవతకోసం ఎదురు చూస్తున్నాడు అచ్యుతరావు. ఇంతలో పెద్ద చప్పుడైంది వెనుక భాగంలో. వెనక్కుతిరిగాడు. బంగళా పడమటివైపు వరండాలోంచి భయంకరమైనకూతలు ధ్వనులు వినవచ్చాయ్! ... అచ్యుతరావు గుండెలు 'బెండమూరు' లంకలు పట్టాయ్! ఇంతలో ఓ ఇటికముక్క వచ్చి ఎదుటిగోడకు గుద్దుకుని అచ్యుతరావు కాళ్లముందు పడింది! మనవాడు దాంతో గుండెలు చేత్తోపట్టుకుని రెండు అంగలలో ఇల్లుచేరుకున్నాడు. ప్రేయసిని మరి స్మరిస్తే వొట్టు. మర్నాడు ఆమె "రాత్రి రాలేదేమండీ?" అని అడిగింది. అచ్యుతరావు నల్లగా ముఖం మాడ్చుకుని ఇంట్లోకి వెళ్లిపోయాడు.

చిన్న రహస్యం: అచ్యుతరావుకు బుద్ధి తెప్పించాలనే ఉద్దేశ్యంతో ఆమే ఆ హంగామా చేసిందని తరువాత తెలిసింది! ఈవిషయం మరెక్కడా పొక్కనీయకండి!

కె. వర్ధనరావు

* * *

## శివాజీ పటం

ప్రతిరోజు మా పక్కింటిఅమ్మాయి, తాతగారిదగ్గర తెలియని పాఠాలు చెప్పించుకొంటోంది. ఓ దినం తాతగారు పాఠంచెప్పడం మొదలుపెట్టారు ఆదినం శివాజీపాఠం ఛత్రపతికి తల్లి చిన్నతనములోనే మహావీరుల కథలు, వారి ధైర్యసాహసాలు, వారి దేశభక్తి గురించి చెప్పేది. అందువల్లనే ఛత్రపతికూడ శూరుడు, దేశభక్తుడయ్యాడు. అంటూ చటుక్కున ఆగిపోయి, ఎదురుగా గోడమీద వ్రేలాడుచున్న, బూజుపట్టి అద్దంపగిలిపోయిన 'శివాజీ' పటం

వైపు చూసి 'అమ్మా ఆ పటం ఎవరిది?' అన్నాడు. అమ్మాయిచూసి తక్షణమే అది 'శివాజీది' అన్నది.

'ఏమిటమ్మా' అలా అంటావు. సరిగా చెప్పు' అన్నాడు తాత బోసినవ్వుతో. 'తప్పు చెప్పానేమో నని, తిరిగిచూసి, 'అవునండీ అది శివాజీదే' కావాలంటే తీసుకొచ్చిచూపిస్తా' అని లేవబోయింది. 'వద్దులే' అంటూ 'పిచ్చిపిల్లా! ఆ పటం శివాజీది అంటావే. అది మందికదూ! ఇంతా మేము కొని, పటం కట్టించి భద్రంగా దాచుకుంటే, పుసిక్కిని శివాజీది అంటావే! ఇదేనా న్యాయ్యం! ఏమమ్మా చెప్పు ఇప్పుడైనా ఎవరిది?' అన్నాడు సీరియస్‌గా.

తర్వాత యిద్దరూ నవ్వు ఆపుకోలేక పోయారు. ప్రసాద్

* * *

## అదీ ఆజ్ఞ

పూర్వమొక రాజుండేవాడు. ఆ రాజుకి ఒకనాడు భార్యల మాట ప్రకారం భర్తలు నడుచుకుంటున్నారా లేక భర్తలమాటప్రకారం భార్యలు నడుచుకుంటున్నారా అనే ధర్మసందేహము కల్గింది. దానినిగూర్చి రాజు మంత్రి నడిగేడు. మంత్రి తనభార్య మాటప్రకారం నడుచుకుంటున్నానని చెప్పి, తనలాగే అందరు భర్తలూ నడ్చుకుంటున్నారని చెప్పేడు. "భార్యమాట వినే మొగుడేం మొగుడు" అని దీన్ని పరీక్షించాలనుకొని, రాజ్యంలో గల పెళ్లయిన మగవాళ్లనందరినీ పిలిపించి భార్యమాట వినేవారిని ఎడం ప్రక్క నిలబడమన్నాడు. మిగతా వాళ్లని కుడిప్రక్కన నిలబడమన్నాడు. అందరూవచ్చి ఎడంప్రక్క నిలబడ్డారు కాని ఒకడు కుడిప్రక్కకి వచ్చేడు. అంత రాజు వానితో "అయితే నీభార్య నీ దాసి అన్నమాట" ఈమాటలు విని వాడు "మహారాజా! ఇదీ నాభార్య ఆజ్ఞే ఆమె నన్ను కుడిప్రక్క నిలబడమంది. అందుచే ఆమె ఆజ్ఞ శిరసావహించేను" ఈ జవాబు విని రాజు విస్తుపోయేడు.

దూర్వాసుల సీతారామమూర్తి

## ఎదురుదెబ్బ లేక రిపార్టీ

శ్రీనివాసరావు, సుబ్రమణ్యం ఇద్దరు ఒకే రూములోవుండి చదువుకుంటున్నారు కాలేజిలో. సుబ్రహ్మణ్యానికి కవిగావాలన్న ఉద్దేశ్యం బాగా వుంది. అందుకనే స్పెషల్ తెలుగువున్నగ్రూపు తీసుకున్నాడు. ఇప్పుడిప్పుడు ఎవరితో మాట్లాడినా వ్యాకరణయుక్తంగా మాట్లాడడం మొదలెట్టాడు. శ్రీనివాసరావుకి యీ పద్ధతి సుతరామూ నచ్చలేదు. ఏదోవిధంగా సుబ్రహ్మణ్యానికి బుద్ధి చెప్పాలనుకున్నాడు.

ఆనాడు శ్రీనివాసరావు బజారునుండి రూముకి వచ్చేసరికి లోపల గడిబెట్టి వున్నది. ఇదివరకే శ్రీనివాసరావుకి సుబ్రహ్మణ్యంమీద కొంచెం అనుమానం. ఎందుకంటే, సుబ్రహ్మణ్యం రోజూ కూరగాయలమ్మాయితో సరససల్లాపాలాడటమే!

ఇంకేం! ఇవ్వాళ ఇలా తలుపుగడి వేయడంతో శ్రీనివాసరావుకి అనుమానం మిక్కుటమైంది. సుబ్రహ్మణ్యాన్ని అవమానపరచడానికిదే అదననుకున్నాడు. పత్తేదారువలె పనిజేయాలనుకున్నాడు. ఎత్తైన వెనుక గోడ ఎగిరిదూకాడు. వెనుకవాకిలిదీసి లోనికెళ్ళాడు. గదిలో సుబ్రహ్మణ్యం లేదు. "తన ఊహ వట్టి అపోహ! తన కృషి నిరర్థకం" అనుకున్నాడు. గోడదూకడంతో తన కాలికి తగిలిన దెబ్బ యిప్పుడు నొప్పి బుట్టసాగింది.

ఇంతలో చేతిలో సోప్‌బాక్స్ పైన తువ్వాళతో స్నానాలగదినుండి ప్రవేశించాడు సుబ్రహ్మణ్యం. గదిలో కూర్చునివున్న శ్రీనివాసరావుని చూడగానే ఆశ్చర్యంవేసింది.

"ఎటులొచ్చితివిరా?" అని ప్రశ్నించాడు.

"కాళ్లతో నడిచి" కొంటెగా జవాబిచ్చాడు శ్రీనివాసరావు.

"అదిగాదు మిత్రమా! నీవరుదెంచిన మార్గంబు నడుగుచుంటి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అయితే అడుగు, దాన్నే అడుగు నాకేం!" అన్నాడు శ్రీనివాసరావు. ఈ జవాబుతో సుబ్రహ్మణ్యానికి కోపం వచ్చింది. శ్రీనివాసరావుని కించపరచాలన్న ఉద్దేశ్యంతో "అడిగితి" నన్నాడు.

"ఏమి నుడివినది?" అని ప్రశ్న వేశాడు శ్రీనివాసరావు. సుబ్రహ్మణ్యం గూడ శ్రీనివాసరావు నోటినుండి యీ ప్రశ్నే వస్తుందని వూహించాడు.

"నీవు వట్టి శుంఠవని నుడివినది" అన్నాడు సుబ్రహ్మణ్యం. ఈ దెబ్బతో శ్రీనివాసరావు ముఖం వెలవెలపోతుందనుకున్నాడు. కాని, అలా జరుగలేదు సరిగదా "ఇంకేం! నీవు వట్టి శుంఠవని నీకే చెప్పినదిగా!" అని ఎదురుదెబ్బ గొట్టాడు శ్రీనివాసరావు.

తాను గోడకేసికొట్టిన బంతి తిరిగి తనకేవచ్చి తగలడంతో సుబ్రహ్మణ్యం రసాతల పాతాళలోకానికి దిగజారాడు. శ్రీనివాసరావు ఎవరెస్టు శిఖరాగ్రానికి ఎగబ్రాకాడు.

అలపర్తి వెంకటసుబ్బారావు

* * *

## రుమాలు తెచ్చిన రభస

జగన్నాథం కాలేజీలో ఫస్ట్‌ఇయర్ క్లాసు చదువుతున్నాడు. యోగ్యమైన నడవడిగలవాడని పేరు సంపాదించుకున్నాడు. ఒకనాడు కాలేజీవరండాలో లేడీస్టూడెంట్సు క్లాసులోకి పోతున్నారు. మర్యాదగల జగన్నాథంగూడ క్లాసులోకి పోతూ వాళ్లనిచూచి కొంచెం ఆగేడు. ఒక లేడీస్టూడెంటు రుమాలు ఆసమయంలో క్రిందకు జారిపోయింది. మన జగన్నాథంగాడు ఆ రుమాలును తీసి గబగబా ముందుకువెళ్లి లేడిస్టూడెంటును పరికించుచూ, "మీరుమాలా!" అని మర్యాదగా అడిగాడు. కొంటితనముగా ఆ లేడీస్టుడెంటు ఔను 'మాదిగా!' అంటూ లాక్కొని వెళ్లిపోయింది. జగన్నాథంకి ఏడవాలో నవ్వాలో తెలియక వెర్రిమోహంతో నిలబడిపోయాడు. మోహన్‌కుమార్